క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలో చిర్రకుంట ఫీడర్ పరిధిలోని గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ ఉర్మిల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిలాటిగూడ టవర్‌లైన్ ఏర్పాటు పనుల దృష్ట్యా చిర్రకుంట, పాడిబండ, చిలాటిగూడ, తుంపెల్లి, కోసార, మలన్‌గొంది గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా సాయికుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని రోజ్‌గార్డెన్‌లో కమిటీ సభ్యుల సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండపల్లి సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా అనిశెట్టి సదాశివ్, కోశాధికారిగా మహాత్మ చరణ్‌లు ఎన్నికయ్యారు. సురేశ్, ఖలీల్, మొయినొద్దీన్, వెంకటేశ్, శ్రీనివాస్, బిక్కాజీ, మినేష్, సహారె రాజు, శ్రీకాంత్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని సెంట్ క్లారిట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వరుణ్ ఇండియన్ టాలెంట్ ఒలంపియడ్ సైన్స్ ఆన్‌లైన్ టెస్టులో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంక్ సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బిజు జోసెఫ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 14న ఇండియన్ టాలెంట్ ఒలంపియడ్ సైన్స్ ఆన్‌లైన్ టెస్టు నిర్వహించగా శుక్రవారం ఫలితాలు వెలువడినట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు పంపిణీ



లబ్ధిదారుకు ప్రొసీడింగ్ పత్రం అందజేస్తున్న ఎంపీడీవో

బెజ్జూర్: బెజ్జూర్ మండల కేంద్రంతో పాటు కుకుడ, రెబ్బెన, అందుగులగూడ, లంబడిగూడ, మర్తిడి, బారెగూడ గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు ఆదివారం ఎంపీడీవో బండారి ప్రవీణ్ కుమార్ ముగ్గులు వేయడంతో పాటు ప్రొసీడింగ్ పత్రాలు అందించారు. అలాగే లబ్ధిదారులు త్వరగా ముగ్గులు వేసుకొని ఇంటి పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'న్యూస్ చానల్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: ఓ చానల్ కార్యాలయంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు రహెమాన్, టీయూడబ్ల్యూజే(హెచ్ 143) జిల్లా కన్వీనర్ రవినాయక్‌లు డిమాండ్ చేశారు. దాడిని ఖండిస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద ధర్నా చేపట్టారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి..

జర్నలిస్టు స్వేచ్ఛ మృతికి కారకులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జర్నలిస్టు మృతికి సంతాపం ప్రకటించి నివాళులర్పించారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు

బెజ్జూర్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని కుకుడ గ్రామానికి చెందిన జుమ్మిడి సుభాష్ ఆదివారం సాయంత్రం అకాడి పండుగ సందర్భంగా తన అత్తగారి ఊరు లంబాడిగూడ గ్రామపంచాయతీలోని బొగడగూడకు వెళ్లేందుకు కుకుడ గ్రామం నుంచి బెజ్జూర్ వైపు బయల్దేరి వెళ్లాడు. ఈ క్రమంలో సబ్‌స్టేషన్ సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

జిల్లా కేంద్రం.. రోడ్లు అధ్వానం!

ఒకప్పటి మండల కేంద్రం ప్రస్తుతం జిల్లా కేంద్రం, ఒకప్పటి గ్రామపంచాయతీ ప్రస్తుతం మున్సిపాలిటీ, ఒకప్పుడు మండల అధికారులు ప్రస్తుతం జిల్లా అధికారులు హోదాలు మారుతున్నాయే తప్పా పట్టణంలోని సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. పట్టణంలో ఇరుకు రహదారులు, కాలనీల్లో గుంతల రోడ్లతో పట్టణ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. 30 సంవత్సరాల క్రితం వేసిన రోడ్లు కనీసం మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. – ఆసిఫాబాద్‌అర్బన్



గుంతలమయంగా గుండి రహదారి

- గుంతల రోడ్లతో తిప్పలు
- ప్రభుత్వాలు మారినా మారని దుస్థితి

పట్టణంలోని కుమురంభీం చౌక్, ప్రభుత్వ ఆసుపత్రి, కసాబ్‌వాడీ, దస్నాపూర్, కంచుకోట ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు నిత్యం ఇవే రోడ్లపై వెళ్తుంటారు. అయినా రోడ్ల పరిస్థితులు ఎందుకు మారడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలంలో పట్టణంలోని గుంతల రోడ్లపై వెళ్లాలంటే ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి.

చిన్నపాటి వర్షానికే..

కొద్దిపాటి వర్షానికే పట్టణంలోని రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. జిల్లా కేంద్రం నుంచి నాలుగు వరుసల ప్రధాన రహదారికి ఉన్న గుండి అప్రోచ్ రోడ్ పూర్తిగా గుంతల మయమైంది. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారి గుండా వెళ్తుంటాయి. ఇదే రోడ్డుకు పరిసర ప్రాంతాల్లో పాఠశాలలకు



గుంతల రోడ్డుపై పట్టణంలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు(ఫైల్)

వందలాది మంది విద్యార్థులు వెళ్తుంటారు.

నిబంధనలకు పాతర..

మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు ఇరుకుగా మారడంతో పాటు వర్షాలకు డ్రెయినేజీలు పొంగి రోడ్లపైకి చేరుకుంటున్నాయి. దీంతో కాలనీలో దుర్గంధం వెదజల్లుతుంది. కనీసం డ్రెయినేజీల్లో పూడికలు తీయలేని పరిస్థితి ఉంది. చాలా వరకు ఇంటి యజమానులు తమ ఇంటి ముందు ఉన్న డ్రెయినేజీలపై ర్యాంపులు నిర్మించుకోవడంతో పూడికలు తీయలేని పరిస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షానికే డ్రెయినేజీలు నిండిపోయి రోడ్లపైకి చేరి చెరువులు తలపిస్తున్నాయి.

అధికారుల పర్యవేక్షణ లోపం..

పట్టణంలో మున్సిపాలిటీ అధికారుల పర్యవేక్షణ లోపంతోనే పలు కాలనీల్లో రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. చాలా వరకు నూతన ఇళ్ల నిర్మాణంలో రోడ్లపై వరకు ఆక్రమించుకోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా పర్యవేక్షించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లు బాగు చేయాలి



పట్టణంలో ప్రజలు గుంతల రోడ్లపై వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు చేరుతోంది. జిల్లా కేంద్రంలో నూతనంగా రోడ్లను నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. లేకుంటే ప్రజా పోరాటాలు చేపడుతాం.

– మాటూరి జయరాజ్, బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు

అధికారులు స్పందించాలి



జిల్లా కేంద్రంలో రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. అధికారులు నిత్యం ఈ రోడ్లపైనే వెళ్తున్నా సమస్యను నిర్లక్ష్యం చేస్తున్నారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా స్పందించడం లేదు. రహదారులను ఆక్రమించే వారిపై చర్యలు చేపట్టాలి. లేకుంటే కలెక్టరేట్ ఎదుట నిరవధిక దీక్షలు చేపడుతాం.

– దుర్గం దినకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

గుండి రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే



రహదారిని పరిశీలిస్తున్న కోవ లక్ష్మి

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రం నుంచి జాతీయ రహదారికి వెళ్లే గుండి రోడ్డును ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరిశీలించారు. రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో బురదమయంగా మారడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారి నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు పలుమార్లు అధికారులు, పాలకులను కోరారు. ఈ క్రమంలో రోడ్డును ఎమ్మెల్యే పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కలెక్టర్‌తో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. డీఎల్‌పీవో ఒమర్ హుస్సేన్, మాజీ ఏఎంసీ చైర్మన్ చిలువేరు వెంకన్న, రాజంపేట గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల్లో గ్రంథాలయాలు

- విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపే లక్ష్యం
- ఒక్కో పాఠశాలకు 117 పుస్తకాలు
- బొమ్మలతో కూడిన కథల పుస్తకాలు పంపిణీ

కెరమెరి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం గ్రంథాలయ పుస్తకాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపుకోసం పలు రకాల పుస్తకాలను ప్రభుత్వం పాఠశాలలకు అందజేస్తోంది. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 90 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, స్థానిక సంస్థల ఆధ్వర్యంలో 56 పాఠశాలలు ఉన్నాయి. అందులో నుంచి ఎంపిక చేసిన 44 ప్రాథమిక పాఠశాలలకు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలకు గ్రంథాలయ పుస్తకాలు అందజేశారు. ఆయా పాఠశాలల్లో 2451 మంది విద్యార్థులు వీటిని వినియోగించనున్నారు.

రెండు భాషల్లో..

నేషనల్ బుక్స్ ట్రస్ట్, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజి ఆధ్వర్యంలో గ్రంథాలయ పుస్తకాలను రూపొందించారు. నీతి కథలతో విద్యార్థుల్లో మేధా సంపత్తి పెంపొందించేలా పుస్తకాలను తీర్చిదిద్దారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో అందమైన బొమ్మలతో పిల్లలను ఆకట్టుకునేలా పుస్తకాల్లో పాఠ్యాంశాలు ఉన్నాయి. అభ్యసన సామర్థ్యాలతో పాటు విద్యా ప్రగతికి దోహదం చేసేలా ఉన్నాయి.



కథల పుస్తకాలు

చదువు విలువ తెలిసేలా అందులో పాఠ్యాంశాలను పొందుపర్చారు. ఒక్కో పాఠశాలకు 117 రకాల పుస్తకాలు సమకూర్చుతున్నారు. పాఠశాలల్లో ప్రత్యేక గదిని కేటాయించి గ్రంథాలయంగా మార్చి విద్యార్థులు నిత్యం పుస్తకాలు చదివేలా ఒక పీరియడ్‌ను సైతం విద్యాశాఖ అధికారులు కేటాయించనున్నారు.

రోజూ చదివించాలి



విద్యార్థులతో గ్రంథాలయ పుస్తకాలు ప్రతీరోజు చదివించాలి. తీసుకున్న పుస్తకాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి. అర్థం కాని విషయాలను ఉపాధ్యాయులు చిన్నారులకు వివరించాలి. విద్యా సంవత్సరం ముగిసే వరకు పుస్తకాలను భద్రంగా ఉంచాలి. ఎంతో ఆకట్టుకునేలా ఉన్న పుస్తకాలపై విద్యార్థులు దృష్టి సారించేలా చూడాలి.

– ఆదే ప్రకాశ్, ఎంఈవో

భక్తిశ్రద్ధలతో సుందరకాండ పారాయణం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ హనుమాన్ ఆలయంలో లోకకల్యాణార్థం మహిళలు మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో సుందరకాండ పారాయణం చేశారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాముహిక సుందరకాండ పారాయణం, రామరక్ష స్తోత్రం, మంగళహారతి, మంత్రపుష్పం నిర్వహించి తీర్థప్రసాద వితరణ చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం మహా అన్నప్రసాద వితరణ చేశారు. రోహిణిమసాదె, అరుంధతి, వారణాసి పద్మ, ఉమ, ఉష, సుధారాణి, మంజుల, ప్రియాంక, సుమిత్ర, లావణ్య, దీప, మంగమ్మ, విజయ పాల్గొన్నారు.



సుందరకాండ పారాయణం చేస్తున్న మహిళలు

జోడేఘాట్‌లో అకాడి పండుగ



పెద్ద దేవునికి మొక్కుతున్న ఆదివాసీలు

కెరమెరి: అమరవీరుడు కుమురంభీం గ్రామం జోడేఘాట్‌లో ఆదివారం ఘనంగా అకాడి పండుగను ఆదివాసీలు జరుపుకున్నారు. కులదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆచార వ్యవహారాలతో పంటలు బాగా పండాలని, అధిక దిగుబడులు రావాలని, గ్రామంలో ఉన్న పశుపక్ష్యాదులు, కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలతో ఉండాలని వన దేవతలకు మొక్కుకున్నారు. అనంతరం జెండాలకు ప్రత్యేక పూజలు చేశారు. దేవతకు పూజలు చేసిన నీళ్లను పశువులపై చల్లారు. సాంప్రదాయ బద్ధంగా ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. సాయంకాలం కోళ్లను బలిచ్చారు. కార్యక్రమంలో దేవారి ఆత్రం గంగు, పెందోర్ రాజేశ్వర్, కేశవరావు, ఆనందరావు, మారుతి, లచ్చు, మారు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అకాడి

కౌటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం రైతులు భక్తిశ్రద్ధలతో అకాడి పండుగ నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఇళ్లల్లో నైవేద్యాలు చేసి స్థానిక పోచమ్మ ఆలయంలో భాజాభజంత్రీలతో మొక్కులు చెల్లించారు. ఇళ్లల్లో పిండి వంటలు, మాంసాహార వంటలు చేసి పండుగ జరుపుకున్నారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావారణం నెలకొంది.



అన్నం ముద్దలకు పూజలు చేస్తున్న కటోడా

చింతలమానెపల్లి: మండలంలో ఆదివారం అకాడి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో గ్రామదేవతలను కొలిచి మొక్కులు తీర్చుకున్నారు. పోచమ్మ ఆలయాల వద్ద పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో రైతులు తమ సాంప్రదాయ పూజలు నిర్వహించారు. బాలాజీ అనుకోడ గ్రామసమీపంలోని వేల్పుల దేవత వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాంతి భద్రతలను పరిరక్షించాలి

ఆసిఫాబాద్‌రూరల్: నేరాల నిర్మూలనకు తోడ్పడాలని, శాంతి భద్రతలను పరిరక్షించాలని సీఐ రవీందర్ అన్నారు. ఆదివారం రవిచంద్ర కాలనీలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, యువత చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు లోనుకాకుండా ఉండాలన్నారు. గుడుంబా తయారీ, గంజాయి విక్రయం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్, 30 మంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: యువత మత్తుకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని సీఐ సత్యనారాయణ అన్నారు. మండలంలోని గోయగాం గ్రామంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు లేని 47 మోటార్ బైక్‌లను సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఎవరైన గంజాయి మొక్కలు పెంచినట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.



కెరమెరి: మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

కార్యక్రమంలో ఎస్సై మధుకర్, సతీశ్, పోలీసులు ఉన్నారు.

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామంలో ఆదివారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లల్లో తనిఖీలు చేసి సరైన పత్రాలు లేని 35 బైక్‌లను, ఆటోను సీజ్ చేశారు. 10 లీటర్ల గుడుంబా, 37 దేశీదారు మద్యం సీసాలను పట్టుకున్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయికు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కౌటాల సీఐ రమేశ్, ఎస్సై విజయ్, నరేశ్, విక్రమ్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌రూరల్: అవగాహన కల్పిస్తున్న సీఐ



కౌటాల: సీజ్ చేసిన ద్విచక్రవాహనాలు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కృష్ణారావు

పెంచికల్‌పేట్: అగర్‌గూడ గ్రామానికి చెందిన తుమ్మిడే రాజశేఖర్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కోనేరు అభిమానులు, దాతల సహకారంతో సేకరించిన రూ. 3లక్షల 75వేల నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. నాయకులు కోనేరు వంశీ, చౌదరి తిరుపతి, సంజీవ్, సుధాకర్, సాజిద్, వెంకన్న, శ్రీనివాస్, మహేశ్, మారన్న, చలం, ఖైరాత్, ఎస్‌కే బాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో..

బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డా. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు పార్టీ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు రాజు, తోగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయం.. అ'పూర్వం'




వాంకిడి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005 -2006 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 20 ఏళ్ల తర్వాత కలిసిన విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు నాంపల్లి శంకర్, శ్రీనివాస్, సాయన్న, రాములు, శంకర్, ధర్మబాయి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

రెబ్బెన: మండల కేంద్రంలో నిర్మాణం చేపట్టిన సులభ్‌కాంప్లెక్స్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రజలకు అందుబాటులో మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ స్థలంలో నిర్మించిన మరుగుదొడ్లను ఇప్పటివరకు వినియోగంలోకి తీసుకురాకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రారంభానికి ముందే సులభ్‌కాంప్లెక్స్ గోడలకు పగుళ్లు తేలుతున్నాయని ప్రజలు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సులభ్‌కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా నాంపెల్లి శంకర్



బాధ్యతలు స్వీకరిస్తున్న నాంపెల్లి శంకర్

ఆసిఫాబాద్: 2025 -26 సంవత్సరానికి గాను ఆసిఫాబాద్ లయన్స్‌క్లబ్ కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జిల్లాకేంద్రానికి చెందిన నాంపెల్లి శంకర్, ప్రధానకార్యదర్శిగా వేణుగోపాల్, కోశాధికారిగా పుల్లూరి శంకర్, సంయుక్త కార్యదర్శిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా వెంకటరమణారెడ్డి, డైరెక్టర్లుగా ఇరుకుల్ల ఆంజనేయులు, రావుల వినాయక్ రావు, కోట వెంకన్న, అబుల్ ఫయాజ్, లయన్ ఎల్‌సిఐఎఫ్ కాలేజి కోఆర్డినేటర్‌గా ఉబేద్ బిన్ యాహియా, అబ్దుల్ అన్సారీ, రాజీవ్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'దేశంలో సుస్థిర పాలన'

రెబ్బెన: ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో దేశంలో సుస్థిరపాలన సాగుతోందని బీజేపీ జిల్లా కార్యదర్శి కుందారపు బాలక్రిష్ణ, మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గడిచిన పదేళ్లలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. కేంద్ర పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లేందుకు బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. మధుకర్, పందిర్ల కనకయ్య, సంజీవ్, మల్లేష్, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.